క్లుప్తంగా

క్విజ్ పోటీలో ఊట్‌పెల్లి విద్యార్థులు ప్రతిభ



బహుమతులు అందిస్తున్న అధికారులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ స్థాయి క్విజ్ పోటీలో ఊట్‌పెల్లి విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. పోసానిపేట విద్యార్థులు ద్వితీయ బహుమతి, దుంపేట విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రాజేశ్, ఎంఈవో ఆనందరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం అర్జున్, స్థానిక హెచ్‌ఎంలు రాజయ్య, విష్ణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న అంబేడ్కర్ నగర్ కాలనీవాసులు

కోరుట్ల: బార్ అసోసియేషన్ కోరుట్ల అధ్యక్షుడిగా ఎన్నికైన తన్నీరు శ్రీనివాసరావును అంబేడ్కర్ నగర్ కాలనీవాసులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీనివాస రావు పేదలకు ఉచిత న్యాయ సలహాలు అందిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందు నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పసుల కృష్ణ ప్రసాద్, అంబేద్కర్ సంఘం నాయకులు మారంపల్లి నర్సయ్య, బొల్లె గంగాధర్, సురేశ్, తాళ్లపల్లి శేఖర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి గల్ఫ్ సేవా సమితి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

ధర్మపురి: మండలంలోని జైనా గ్రామానికి చెందిన కుంటా చంద్రమౌళి అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి గల్ఫ్ సేవా సమితి చేయూతనందించింది. నిరుపేద కుటుంబం కావడంతో జైనా- కోస్నూర్‌పల్లె గల్ఫ్ సేవాసమితి వారి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి గురువారం రూ.30 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో గల్ఫ్ సేవా సమితి సభ్యులు మధుసూధన్, మల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మధుకర్, రాము, రాజన్న పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో న్యూ విజన్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న కుమ్మర్‌పల్లి కార్తీక్ నవోదయలో 6వ తరగతిలో సీటు సాధించడంతో గురువారం కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్ విద్యార్థినికి..

కథలాపూర్: మండల కేంద్రంలోని మాస్త్రో హైస్కూల్ లో 5వ తరగతి చదువుతున్న రిక్కుల హనీష అనే విద్యార్థిని జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ అకుల రాజేశ్, హెచ్‌ఎం ఆకుల శ్రీరంజిత్ అభినందించారు.

'కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి'

మల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి అన్నారు. గురువారం ముత్యంపేటలో మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లోకి వస్తుండడం శుభపరిణామమన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేయడంతోనే గెలుపు ఖాయమైందన్నారు. కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

నేడు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

జగిత్యాల: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఈనెల 5న కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. ఉన్నతాధికారులు, దళిత సంఘాల నాయకులు, అన్నివర్గాల ప్రజలు హాజరు కావాలని సూచించారు.

పర్మనెంట్ ఏవో వచ్చేదెప్పుడో?

- ఏవో లేక రైతులకందని సలహాలు, సూచనలు
- అడపా,దడపా వచ్చిపోతున్న ఇన్‌చార్జి అధికారి
- ఇబ్బంది పడుతున్న రైతులు



పెగడపల్లిలో వరి పొలం పరిశీలిస్తున్న ఏఈవో(ఫైల్)

పెగడపల్లి: మండలంలో దాదాపు 90 శాతం మంది వ్యవసాయమే ఆధారం. పంటల సాగులో వ్యవసాయ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తూ అధిక దిగుబడి సాధించేలా కృషి చేస్తారు. కానీ పెగడపల్లి మండలంలో పూర్తి స్థాయి ఏవో లేక పోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ పని చేసిన ఏవో కరుణ నాలుగేళ్ల క్రితం బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో కొడిమ్యాల ఏవో జ్యోతికి పెగడపల్లి అదనపు బాధ్యతలు అప్పగించారు. సుమారు రెండేళ్ల పాటు ఇన్‌చార్జి ఏవోగా పని చేసిన జ్యోతిని ఇక్కడి నుంచి బదిలీ చేసి జగిత్యాల ఏవో వినీలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జీ ఏవో ఎప్పుడో ఒకసారి మండలాన్ని సందర్శించి ఎరువుల దుకాణాలు తనిఖీలు చేయడం తప్పా రైతుల పంట పొలాలు సందర్శించడం లేదని రైతులు వాపోతున్నారు. పర్మినెంట్ ఏవో లేక పోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిషత్ సమావేశాల్లో ప్రతీసారి ప్రజాప్రతినిధులు రెగ్యులర్ ఏవోను నియమించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని 23 గ్రామాల్లో దాదాపుగా 28 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఇక్కడ 90 శాతం వ్యవసాయమే జీవనాధారం కావడంతో వారికి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించేందుకు వ్యవసాయ అధికారి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఏఈవోలు ఐదుగురికే నలుగురే విధులు నిర్వహిస్తున్నారు. ఒకరు సెలవులో ఉన్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ ఏవోను నియమించాలని మండల రైతులు కోరుతున్నారు.

అందుబాటులో ఉండేలా చర్యలు

జగిత్యాల ఏవోకు ఇన్‌చార్జి ఇచ్చాం. వారంలో రెండు మూడు రోజులు మండలంలో పర్యటిస్తూ రైతులకు అందుబాటులో ఉండాలని సూచించాం. ఏఈవోలను గ్రామాల్లో పర్యటించాలని ఆదేశాలు జారీ చేశాం.

అభివృద్ధికి నోచుకోని వెంకన్న ఆలయం

- ఏటా ఉగాది రోజున ఘనంగా జాతర
- సౌకర్యాలు కల్పిస్తే భక్తుల ఆదరణ



ఆలయంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి

బుగ్గారం: చుట్టూ అందమైన అటవీ, పచ్చని పంటపొలాలతో ఎటుచూసినా పచ్చదనం. ఎత్తైన గుట్టపై కొలువైన వేంకటేశ్వరుడు. గుట్టపైకి ఎక్కి చూస్తే ఎంతో ఆహ్లాదకరమైన పరిసరాలు. బుగ్గారం మండలం అర్సికోట అటవీప్రాంతంలోని చందయ్యపల్లెలో ఎత్తైన గుట్టపై నెలకొన్న శ్రీవేంకటేశ్వరాలయం ఉగాది జాతరకు ప్రసిద్ధి గాంచింది. ఈ ఆలయంలో ప్రతీ ఏటా ఉగాది రోజున నిర్వహించే జాతర సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అనేక మంది భక్తులు శ్రావణమాసం,కార్తీక మాసం రోజుల్లో స్వామివారిని దర్శించుకుని గుట్ట క్రింది ప్రాంతంలో వంటలు వండుకొని వన భోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. భక్తుల ఆదరణ ఎక్కువగానే ఉన్నప్పటికీ ఈ ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు.

ఏటా ఉగాది రోజున నిర్వహించే ఉత్సవాలకు జిల్లాలోని వివిధ మండలాల నుండి వేలాదిగా భక్తజనం తరలివస్తారు. ఇక్కడ రాత్రిపూట స్వామివారు రథంపై భక్తులకు దర్శనమివ్వడం తరతరాలుగా వస్తున్న సాంప్రదాయం. భక్తులు ముందుగా గుట్టపై గల వేంకటేశుడిని దర్శించుకుని సాయంత్రం గుట్ట కింద జరిగే రథోత్సవ వేడుకలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతీ ఏడాది భక్తుల తాకిడి పెరుగుతున్నప్పటికీ దశాబ్దాలుగా ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. భక్తుల కోసం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే ఇంకా ఆదరణ పెరుగుతుంది. కల్యాణవేదిక, గుట్టచుట్టూ ఫార్మేషన్ రోడ్డు ఏర్పాటు చేస్తే భక్తులు తిరగడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు,ఉన్నతాధికారులు స్పందించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.

చిన్న పిల్లలకు ఆట, పాటలతోనే విద్య



సంగెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

ఇబ్రహీంపట్నం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిలలకు ఆట, పాటలతోనే విద్యను అందిస్తే సులభంగా అర్థమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ అన్నారు. గురవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆన్యువల్ డే, గ్రాడ్యుయేషన్‌డే సెలబ్రెషన్‌ను నిర్వహించారు. ఈ సందర్బంగా మూడు నుండి ఆరు సంవత్సరాల పిలల్లో శారీరక, మానసిక మేధోవికాసం బడికి సంసిద్ధత సామాజిక అభివృద్ధిలను, బాష అభివృద్ధిను గురించి తెలిపారు. అనంతరం పిల్లలకు అసెస్మెంట్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం, యూసుఫ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్‌కు వచ్చే 3–4, 4–5 ఏళ్ల పిల్లలకు ప్రోగ్రెస్ రిపోర్టులు అందించి, వారి తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ రిపోర్టులు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శైని మాథ్యు, షమీమ సుల్తానా, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

రాయికల్: మండలంలోని ఇటిక్యాల, కిష్టంపేట గ్రామాల్లో ప్రీ స్కూల్‌డే సందర్భంగా గురువారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, సుజాత, బుజ్జమ్మ, అనురాధ పాల్గొన్నారు.

వడ్డెర కులస్తుల సంక్షేమానికి కృషి

జగిత్యాలటౌన్: వడ్డెర కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో గురువారం అంతర్గాం వడ్డెర కాలనీకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, జీవన్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భవన నిర్మాణ రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఒడ్డెర కులస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఆర్థికంగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

మల్లాపూర్: రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ వీర్‌సింగ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రేషన్ షాప్‌లను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని కల్లెం లలిత రేషన్‌షాప్‌ను తనిఖీ చేయగా 1.42 క్వింటాళ్ల బియ్యం అవకతవకలు పాల్పడినట్లు తెలిందన్నారు. దీంతో సదరు రేషన్ షాప్ డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ సురేశ్, సిబ్బంది ఉన్నారు.

వృథాగా భగీరథ నీరు.. పట్టించుకునే వారెవరు?



వెంకట్రావ్‌పేటలో లీకేజీ అవుతున్న నీరు

మెట్‌పల్లి: ఇంటింటికి తాగునీటిని అందించాలని గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని రూపొందించింది. దీని కింద పట్టణంలో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు ఇచ్చినప్పటికీ ఇంకా చాలా ఇళ్లకు భగీరథ నీటిని సరఫరా చేయడం లేదు. డబ్బా గ్రామంలోని వాటర్ గ్రిడ్ నుంచి పట్టణానికి అవసరం మేరకు నీటిని సరఫరా చేయకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. మరోవైపు చాలా చోట్ల భగీరథ పైపుల లీకేజీలతో భారీగా నీరు వృథాగా పోతోంది. నీటి కొరత నెలకొన్న పరిస్థితుల్లో లీకేజీలకు వెంటనే మర్మమతులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో ఆయా చోట్ల రోజుల తరబడి నీరు పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా ప్రకాశ్



పెద్దెల్లి ప్రకాశ్

కోరుట్ల: కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా టీపీసీసీ సెక్రటరీ పెద్దెల్లి ప్రకాశ్ నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గంలో కార్యకర్తలను, నాయకులను సమన్వయం చేస్తూ పార్టీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా కృషి చేస్తానని పెద్దెల్లి ప్రకాశ్ తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఐటీమంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్,రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుకు ప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా చంద్రశేఖర్



చంద్రశేఖర్

ధర్మపురి: భారతీయ జనతా పార్టీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ఓరగంటి చంద్రశేఖర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపాడు.

ఫంకీ బాయ్స్ ఫ్యాషన్ హబ్ ప్రారంభం

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫంకీ బాయ్స్ ఫ్యాషన్ హబ్ షాప్ గురువారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ధర్మపురిలో నిర్వహించిన వివిధ వివాహ శుభ కార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డీ–53 ప్రధాన కాలువ వంతెన



రంగపేట శివారులో కూలిపోయిన ప్రధాన కాలువ సేఫ్టీవాల్స్

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్, ధర్మపురి, బుగ్గారం, జగిత్యాల రూరల్ మండలాలకు సాగునీరు అందించే ఎస్సారెస్పీ డీ–53 ప్రధాన కాలువ వంతెన ప్రమాదకరంగా మారింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వేలాది ఎకరాలకు సాగునీరు అందించే డీ–53 ప్రధాన కాలువ నిర్మాణ సమయంలో సారంగాపూర్ మండలం రంగపేట, రాయికల్ మండలం రాజనగరం గ్రామాల మధ్య ఉన్న ఈ వంతెనకు ఇరువైపులా ఉన్న సేఫ్టీవాల్స్ పూర్తిగా కూలిపోయాయి. దాదాపు 50 ఏళ్ల క్రితం నిర్మాణం చేసిన ఈ వంతెనపై నుంచి వాహనాలు రోజంతా నడుస్తుంటాయి. వంతెన నిర్మాణం జరిగిన చోటే రోడ్డు క్రాసింగ్ ఉండడంతో వాహనదారులు ఏ కొద్ది అజాగ్రత్తగా వ్యవహరించినా భారీ నష్టం జరుగుతుంది. ఈ కాలువ నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు 800 క్యూసెక్కులు వెళ్తుంది. వంతెనకు సేఫ్టీ వాల్స్ కోసం గత ప్రభుత్వ హయాంలో నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినా పనులు ముందుకు సాగలేదు. అధికారులు స్పందించి నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆస్తి పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి: ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ తెలిపారు. ఈ నెల 30లోపు చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఆలోపు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా పశువైద్య శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్‌లో గురువారం పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కందూకూరి పూర్ణ చందర్, పంచాయతీకార్యదర్శి కడుమూరి రాఘవేందర్, ఆఫీస్ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వెల్గటూర్ : ఎండపల్లి మండలం రాజారంపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రాజారాంపల్లిలో గురువారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఎనిమిది ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమ దందాలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

మల్లాపూర్: మండలంలోని సాతారం శివారులోని పెద్దవాగు నుంచి గురువారం అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. సాతారం శివారులోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారంతో మేరకు పోలీసు సిబ్బందితో దాడి చేసి రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

కొత్తపేటలో పోచమ్మతల్లికి బోనాలు



కొత్తపేటలో బోనాలతో వస్తున్న మహిళలు

రాయికల్: మండలంలోని కొత్తపేటలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం గ్రామానికి చెందిన మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి పోచమ్మతల్లికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మందుల నాగరాజు, మందుల బక్కన్న పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భక్తులు

మల్యాల: మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో గురువారం వేద పండితులు ముస్తాల సంతోశ్ శర్మ, కొత్తపల్లి ప్రణీత్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆధ్వర్యంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, నేరెళ్ల భూమారెడ్డి, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, పోతరాజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మబ్బులతో అన్నదాతల ఆందోళన



పెగడపల్లిలో కోతకు సిద్ధంగా ఉన్న వరి

పెగడపల్లి: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. పొద్దంతా వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులతో ఆకాశం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుంటుండంతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. యాసంగి వరి పంట ప్రస్తుతం చేతికొచ్చే దశలో ఉంది. ఈ సమయంలో వర్షాలు పడితే రైతులకు కోలుకోని విధంగా నష్టం వాటిల్లే ప్రమాదముందని చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు ప్రతి ఏటా రైతులను నష్ట పరుస్తున్నాయి. ప్రధానంగా పంట చేతికొచ్చే దశలో వీటి ప్రభావం అధికంగా ఉండటంతో నష్టం కూడా అధికంగానే జరుగుతుంది. దీంతో రైతులు భారీగా నష్టపోయి అప్పులపాలయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

వర్షం కురిస్తే ఆగమాగమే..

వర్షం వస్తే అన్నదాతకు నష్టం వాటిల్లక తప్పదు. వర్షాలు కురిసినట్లయితే పంట నష్టపోయి ధాన్యం దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. వరి పంటపై ఒక్కో రైతు ఎకరాకు సుమారు 10 నుంచి 15 వేలు ఖర్చు చేశారు. ఇప్పుడిప్పుడే వరి పంటను కోసుకొనే పనిలో రైతులు నిమగ్న మయ్యారు. వర్షంవస్తే నష్టపోక తప్పదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. యాసంగి సీజన్‌లో వరిసాగు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని ప్రభుత్వం ప్రచారం చేసినా ఎక్కువ శాతం మంది రైతులు వరిసాగు వైపే మొగ్గు చూపారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ముందుకు వచ్చినా.. మరోపక్క అకాల వర్షాలు తమను ఎక్కడ ముంచుతాయోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. సీజన్ ఆరంభంలో వాతావరణం అనుకూలించడం, ఆశించిన స్థాయిలో వర్షాలు రావడంతో రైతులు ఉత్సాహంగా పంట సాగు చేశారు. మండలంలో 26 వేల ఎకరాలకు పైగా వరి పంటను సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఆకాశంలో కమ్ముకొస్తున్న మబ్బులు రైతును ఒక్క చోట నిలువనీయడం లేదు. మబ్బుల కారణంగా రైతులు తీవ్ర ఆందోళన చెందుతూ దేవుడా కరుణించమని వరుణుడిని వేడుకుంటున్నారు.